# నాలో నేను

ఇదేమిటీ ఈ శ్రావణ చందమామ? మేఘాల్లోంచి ఇలా దయచేశాడు? ఎక్స్‌రే ఫోటోలోని పుర్రెలాగుంది చందమామ?..........ఇలా ఊహిస్తోందేం మనస్సు..........రవీంద్రుడు పోయాడని తెలిశాక ఇలా తయారైంది కాబోలు మనస్సు..........రవీంద్రుడు, గాంధీ ఈ ఇద్దరినీ నేను ఫోటోలలో తప్ప చూణ్ణేలేదు. గాంధీజీవీ, రవీంద్రునివీ చాలా కొద్ది రచనలే చదివాను. నా కంటే టాగూరు ఎడ్మైరర్సు గీతాంజలి, క్రిసెంట్ మూన్ గారెనర్‌లలోంచీ, ఇంకా ముదిరినవాపు గోరా, రెక్, సాధనల

లోంచీ, అదృష్టవంతుల చయనిక చిత్ర [పద్యాల సంపుటంకూడా ఓటి ఉంది] లలోంచీ, "కోట్" చేస్తూ వుంటారు. టాగూరును గురించి నే నెన్నడూ నోరు విప్పలేదు. కాని, యివాళ ఔొల్లు ఆగటం లేదు.

అదేం లింకో మరి, కొద్ది కథలు టాగూరువి నేను చదివినవి. పద్యాల్లో ఊర్వశి, నాటకాల్లో గృహప్రవేశం, వ్యాసాల్లో ఔసన్ కవి జీవితంమీద రాసింది. ఇంతేనేమో.

గాంధీజీవీ అంతే. ఆత్మకథా, కొన్ని హరిజన్‌లో వ్యాసాలూ.

కాని గాంధీజీనీ, టాగూరునీ నేను మృత్యుంజయులను కున్నాను. తెలుసు, జన్మ వున్నప్పుడు చావూ వుందని. అయినా, టాగూరూ గాంధీజీ యిద్దరూ మరణించరనీ, ఆచంద్రార్కం ఇలావుంటా రనీ. నా బోటివాళ్ళ హృదయాల స్పందనాలని తాము పలుకుతారనీ. అదే. ఆ సందేశమే. ఆ లీలే వారు మనకిచ్చేవి అని అనుకున్నాను. వారూ వారి పనులూ, వారి మూర్తీ మన నెత్తురులో కలియ బట్టో, ఏమో— పేరే మంత్రంలా మోగిస్తున్న వారిద్దరినీ అలా ఊహించాను.

కొద్దిరోజుల క్రితం ఆంధ్రపత్రికలో టాగూరు ఆరోగ్యం దిగ జారుతోందని చదివి, హటాత్తుగా పెదిమ విరిచాను. దక్కడు ఇక అని. ఛా, ఇదేమిటీ ఇలా అన్నాననుకున్నాను. మన మనస్సులే పాపాన్ని శంకిస్తాయి. ఇదేం పాపం, ఆడవాళ్ళకుండే—ఇంట్యూషన్ పలికింది నాలో. ఛీ, యీ వార్త విన్నాక, యిప్పుడు నా మొహాన కత్తి వేస్తే నెత్తురు చుక్కలేదు. ఏదో గిల్టీగా ఫీలవుతున్నాను.

ఇందాకణ్ణించీ మథన పడుతున్నాను. ఎప్పుడో అప్పుడు పోవాలే అని. నిజమే, పోవచ్చుగాని, పోగూడదు. వాళ్ళిద్దరూ మనకుండాలి. ఉండి తీరాలి, అమ్మో......ఉండకపోతే ఎలా? బతగ్గలమా?

ఎంత స్వార్థం!

నా సంతోషం కోసం, నా ఆనందం కోసం, నా వానిటీ కోసం, వాళ్ళ చొక్కా చిరిగి పోతున్నా అదే తొడుక్కుని ఉండాలా?

వోసారి శివశంకరశాస్త్రిగారూ, కృష్ణశాస్త్రీ నేనూ మాంబళంలో నడుస్తున్నాము. నాకు వాన అంటే చాలాఇష్టం! ప్రజకు వీలుగా అది రాత్రి 10 దాటాకే కురవాలి. పగటిపూట ఎన్నడూ కురువకూడదు. కాని, కురుస్తున్నప్పుడు, చెట్ల ఆకులన్నీ మైల కడుక్కుని, సంతోషంతో తలలు ఆడిస్తూ కలకల నవ్వుతూన్నప్పుడు, పూలు పరిశుభ్రంగా నిట్టూర్పులు విడవడం మాని, ధీమాగా పిలుస్తుంటేనూ ఖులాసే నాకు. నిజమే. ప్రజకు పగటివాన ఇబ్బంది గాదూ!

కృష్ణశాస్త్రి అన్నాడు, సరదాగానేలే. వాన కురవడం తనకూ ఇష్టమేట. కాని, ఆ వాన కురిసేటప్పుడు తాను వో మేడమీద కిటికీ పక్క కూచ్చుని రోడ్లకేసి చూస్తుంటే, రోడ్డుమీద జనం తడిసి, గజగజలాడి, వొణుకుతూ, నక్కుతూ, తక్కుతూ, ఆ చూరు ఈ చూరు చూస్తూ పోతూ ఉంటే తనకు సంతోషం అన్నాడు.

నాటిమాట నేడు, టాగూరు విషయంలో మళ్ళీ మనసులో తల ఎత్తింది. రెండూ స్వార్థాలే. పాపం, టాగూరు తొడుక్కున్న ఆ పాత లాల్చీ, ఆ వేదప్రభల్ని కక్కే కళ్ళు, ఆ అర్షత్వాన్ని మెరిపించే గడ్డం, ఎంత ఇబ్బంది పడుతున్నాయో— ఇక మేం మోయలేము అని? ఆ కళ్ళు, ఇక చదవం, ఇక చూడం, ఇక పరిశీలించం, ఇక దీవించం అని ఎంత పైకి తెలీకుండా గోల పెట్టాయో — ఆ పాత లాల్చీ మొర్రోమంటూ ఎంత ఇదయ్యిందో.... .... ఆ గడ్డం ఎంతగా చివికిందో......

ఇన్నీ అనుకుంటున్నానా .... ....టాగూరు క్కూడా ఆక్సిజన్ ఇచ్చారని పత్రికల్లో చదివి మహా ఏడ్చా—ఆ నల్లని వెధవ, ఇనప గొట్టం దూరంగా పెట్టి, రబ్బరు ట్యూబుతో గాలి ముక్కుల్లోకి ఎక్కించడం, ఆసుపత్రుల్లో చూచాంగా, హ—బ్బ.

పెధవ సిద్ధాంతాలు మనవి. ఏమిటీ, ఇంత సెంటిమెంటల్‌గా ఫీలవుతున్నావూ? టాగోరు మాత్రం మానవుడు కాడా? ఏం? అని దబాయిస్తోంది లోపల ఏదో సిద్ధాంతం. అన్నట్లు ఈ మధ్య సెంటిమెంటును చావగొట్టి, ఇంటలెక్టును పెంచాలని సిద్ధాంతాలు చేసుకున్నాం గాదూ.

మన సిద్ధాంతాలూ మనమూ, అయ్యో రాత! నెత్తురులో కలిసిన గుణాలు పోతాయా? సెంటిమెంటే ఛస్తే జీవితం ఇంకా అధోగతిలోకి పోదా? అధోగతేమిటిలే? చూడొచ్చామా? ఉత్తమగతికే పోతుందేమో! అదల్లా ఉంచుదాం. టాగూరు ఏ విధాన చూసినా పోగూడదోయ్! ఛాయ్? మనమంతా "ఓం ఛాయ్!" అని టాగూరుకు అంటూ వుండాలిసిందే. టాగూరు రాళ్ళలో గుండెను లేపుతూ శ్రీ రాముడులాగా, సుప్తభారతాన్ని ప్రబోధిస్తూండాలిసిందే!

ఎంత స్వార్థం! టాగూరు తరపున చూస్తే— ఎంతో స్వార్థం! నిజమే. ఐతేనేం, టాగూరు పోగూడదు. స్వార్థం, స్వార్థం అని మనం నిరసించడం నేర్చుకున్నాముగానీ, అదైనా, కథల్లో పత్రికల్లోనూ చదివి అల్లమ్ముర్రబ్బా లాంటి థీరీలు వినీనూ... స్వార్థం ఎవరికిలేదు? ఎందుకు పనికిరాదు? అని చూస్తే, అంతా నటనేమో అనిపిస్తుంది.

ఈ స్వార్థద్వేషుల్ని ఒక్కసారి మద్రాసునుంచి రాజమండ్రీ దాకా, పూరీ పాసింజరులో ప్రయాణించమనూ తెలుస్తుంది, మనకు అక్కరలేని, అవసరం అని మనం ఊహించని ప్రతిస్టేషనులోనూ రైలు ఆగడం. మనం ఎందుకాగిందా అని విసుక్కోవడం, తీరాచూస్తే, కొత్త వాళ్ళరైళ్ళల్లోకి ఎక్కబోటం, పెట్టెలో చోటులేదని మనం వాళ్ళతో కలియబడబోడం, రైలు కదలడం, మళ్ళీ అవతల స్టేషనులో ఏమిరా కాటా అంటే ఎప్పటాటే అనుకోడం! ఏమైందీ స్వార్థం పనికిరాదని కోసిన సొరకాయ! తెల్లటి ముక్కలూ అదీ కిలకిల నవ్వుతూ వాడిపోకుండా మన చేతుల్లోనే తయారు!

స్వార్థం వల్లనేనేమో. "లోకాస్సమస్తాస్సుఖినోభవంతు" అని నిత్యం కోరుకోటం. అంతేకాని, ఫక్తు, అవతలివాళ్ళమీద ప్రేమ అనుకోను. గడియారంలో ఈ చక్రం సరీగా తిరగాలంటే, అవతలి అన్ని చక్రాలూ అన్ని పళ్ళూ ఉండి, సమంగా తిరిగితేనేగదా యిది తిరగడం. మనతిప్పట కోసమే, మన సుఖం కోసమే. అందరినీ సుఖపడమంటున్నామేమో——

స్వార్థం మీద ఇంత అన్నాను గనక, యిదీ ఆవాళ, నేనూ అతనూ, అంటాను. మద్రాసులో తిరుగుతున్నాం. నేను ఆ కాస్తానడుద్దాం అనవచ్చునా, సుఖంమరిగాను కాదూ, రిక్షా ఎక్కుదాంలే అన్నాను. అతను పాపం, రిక్షా ఎక్కద్దులే సాటి మనిషి మోస్తాడు, నేనది భరించలేను అన్నాడు. చూస్కో, నాలో రేగింది రావణాతిక్క.

శత్! ఆ మాత్రం ఆలోచించక కాదు, నేనన్నది. బస్సు ఎక్కాం అనుకో, అది యంత్రం, దాని రాబడి అంతా పెట్టుబడిదారుకు చెందుతుంది, ఇది అలాకాదు, రిక్షావాడికే సంపూర్ణంగా చెందుతుంది!

నీవిచ్చేడబ్బు సాటిమనిషి తినడం, పేదవాడు తినడంన్యాయమా, పెట్రోలుకూ, లూబ్రికేటింగ్ ఆయిలుకూ, (డ్రైవరూ కండక్టర్లు తిని చచ్చేదెంత, వాళ్ళ మొహం!) కాపిటలిస్టుకూ చెందనిస్తావా? ఇదేం న్యాయం అని బుకాయించి రిక్షా ఎక్కించానా, తీరా కూర్చున్నాక అనిపించింది, స్వార్థంకదా ఈ రిక్షా కూడా ఏ కాపిటలిస్టుదో కావచ్చే........ నాకా 'ఇజా'లతో సంపర్కం తక్కువే........ న్యాయంగా ఆలోచిస్తే, స్వార్థం తప్ప యింకా ఏమీలేదే——అని.

ఏమైనా, స్వార్థంగదా అని అనుకుని, చాటుగా మానసికంగా లెంపలేసుకున్నానా, నా స్వార్థం, పాపం రిక్షావాడికి బోణీగా వచ్చిన బేడను యిప్పించింది గదా. వాడు దాంతో కాఫీ తాగి, వెత్తలపాకు

నమిలి, అమ్మయ్య అనుకుంటాడు గదా. నాది స్వార్థమైతేనేం—మిడి మిడి జ్ఞానమైతేనేం—స్వార్థం స్వార్థం అంటూ దాన్ని బూచిలా చూట్టం ఫాషన్ కావడం వల్ల మనం చిలక పలుకులు పలుకుతున్నాం కాని.

నిజం కావచ్చు. మనం చిలకపలుకులు కాకపోతే—చిత్తశుద్ధిగా అనుభవించే రాస్తున్నామా, రాసేదంతా. బతుకుతున్నామా, బతికే బతుకంతా? ఎవరో, ఏ టాగూరో అన్న గొప్ప వాక్యాలను మన భాషలో అంటున్నాము కానీ........టాగూరు

Do not go, my love, with you asking my leave.

I have watched all right, and now my eyes heavy with sleep.

అంటే—

ఏను నిద్దుర వోదునో, యేమొ, కరుణ
సెలవు గైకొనకేగగా వలదు; ఇన్ని
వాళ్ళ యెడలేని యెడబాటు నానిరీక్ష
ణమ్ము బరువులు బరువులై నయన యుగళ
మయ్యో దిగలాగు నిద్దర మరపులకును.

అని కృష్ణశాస్త్రి అన్నట్లు

టాగూర్! మమ్మల్ని వదిలి వెళ్ళావా? నిన్నకాక మొన్న రాత్రే బోస్ కన్య ఏమో అందని, పాపం, పుట్టెడు జబ్బులో ఉండి కూడా, నువ్వు సహించలేకపోయావే? అంతటి దారుణ దుర్దశలో గూడా నీవు కలం తీసుకుని, కుయ్యో, మొర్రో, మేము రాయలేమో అనే వేళ్ళతో వ్యాసం రాశావే! టాగూర్! ఈ శ్రావణ పౌర్ణమి యిక మా జన్మలో తలుచుకున్నప్పుడల్లా చిచ్చుల వర్షంలా భయపెట్టేదేనా?